నరక ప్రయాణం..!

- ముందుకు సాగని బీటీరోడ్డు పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



చిత్తడిగా మారిన కప్పర్ల రోడ్డు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల మధ్య అనుసంధానంగా ఉన్న మట్టిరోడ్లు వర్షాలకు అధ్వానంగా మారుతున్నాయి. బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరైనా.. రోడ్డు పనులు అలస్యం అవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ఆలస్యంగా చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. రోడ్డుపై వేసి మట్టి, మొరం వర్షాలకు బురదమయంగా మారుతున్నాయి. ఈ కారణంగా వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

కప్పర్ల, గిరిగాం రోడ్లపై..

మండలంలోని కప్పర్ల, గిరిగాం గ్రామాలకు వెళ్లాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ మండలంలోని పాచ్చెర గ్రామం నుంచి బండల్‌నాగాపూర్ మీదుగా కప్పర్ల గ్రామం వరకు 6 కిలోమీటర్లు ఉంటుంది. బీటీ రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో గతేడాది ప్రభుత్వం 5 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం రూ.9.3 కోట్లను విడుదల చేసింది. మొర్రం మట్టి వేసి అలాగే వదిలేయడంతో ప్రస్తుతం వర్షాలతో రోడ్డు గుంతలమయంగా మారుతుంది. గిరిగాం గ్రామం నుంచి కుచులాపూర్ ఎక్స్‌రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల మేర ఉన్న లింక్ రోడ్డు బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు కేటాయించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కల్వర్ట్‌లు మాత్రమే పూర్తి చేసి రోడ్డుపై మొర్రం వేసి, వదిలేశాడు. దీంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

ప్రమాదాల బారిన వాహనదారులు..

అసంపూర్తిగా రోడ్డు పనులు చేపట్టడడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. మట్టి, మొరం, కంకర వేసి రోలింగ్ చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా మారుతున్నాయి. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ఎక్కడ జారీ పడుతామో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీరోడ్లు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

బురద రోడ్డుతో ఇబ్బంది



కుచులాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి మా గ్రామానికి రావడానికి ఉన్న రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై నుంచి గ్రామానికి రావాలంటే బైక్ కూడా అదుపు తప్పుడుతున్నాయి. దూరం ఎక్కువైనా తాంసి మండల కేంద్రం మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ప్రయాణ కష్టాలు తప్పడం లేదు.

– గంగారాం, గిరిగాం గ్రామస్తుడు

క్లుప్తంగా

మంత్రి 'పొంగులేటి'ని కలిసిన 'సోయం'



మంత్రిని సన్మానిస్తున్న సోయం బాపూరావు

కైలాస్‌నగర్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావు శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. బోథ్ అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా 500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో

ఇచ్చోడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. శనివారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రసుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మధురిమ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సన్మానిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: ఉట్నూర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మడావి ప్రసాద్‌ను ఆదివాసీ పెద్దలు మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఇంద్రవెల్లి మండలంలో ఆదివాసీల స్థితిగతులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, కనక తుకారం, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ వెంకట్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అందించిన తెలంగాణ మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2025కు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డా.క్లైం వెంకట్ రెడ్డి ఎంపికయ్యారు. వైద్య సేవలతో పాటు సామాజిక సేవలు చేసినందుకు ఆయనను ఎంపిక చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని వైద్యుడు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

బోథ్: మండల కేంద్రంలోని 6వ వార్డులో రెండు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకుని పడిపోయే అవకాశం ఉందని, వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు శనివారం కోరారు. వెంటనే అధికారులు స్పందించాలన్నారు.

దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

బోథ్: నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆలయాల అభివృద్ధికి రూ. 94 లక్షలు మంజూరైనట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌లు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. బోథ్ మండలంలోని కౌఠ(బి) మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 20 లక్షలు, తాంసి మండలంలోని తాంసి–బిలో శివ కేశవ ఆలయ ప్రహరీ, కిచెన్ షెడ్ నిర్మాణానికి రూ. 25 లక్షలు, సొనాల మండలంలోని మామిడిగూడలోని హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 12 లక్షలు, గుడిహత్నూర్ మండలంలోని మార్కాపూర్‌లోని పోచమ్మ ఆలయానికి, రూ. 12 లక్షలు, నేరడిగొండ మండలంలోని మాదాపూర్‌లో అభయ ఆంజనేయ స్వామి ఆలయానికి రూ. 25 లక్షలు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా 'కల్యాణలక్ష్మి'



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 15 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, గొర్ల రాజుయాదవ్, మల్లేపూల నర్సయ్య, జల్కే పాండురంగ్, చిల్కూరి భూమన్న, కానిందే రాజారాం, డుబ్బుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: పెళ్లి రోజే కల్యాణలక్ష్మి చెక్కులను అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెళ్లి అయి నెలలు గడుస్తున్నా కళ్యాణలక్ష్మి చెక్కులు అందడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ జహీర్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సర్పంచులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నేరడిగొండలో ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: మండల కేంద్రంలోని పలు కాలనీలలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

అవగాహనతో వ్యాధులు అరికట్టవచ్చు



అవగాహన కల్పిస్తున్న సుమలత

తలమడుగు: అవగాహనతో వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత అన్నారు. శనివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో క్షయ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణ కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అతి దగ్గు, బరువు తగ్గడం, రెండు వారాలకు మించి జ్వరం ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ విజయ డైయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



జైనథ్: పీరీలతో నృత్యం చేస్తూ..



సాత్నాల: వీధుల్లో పీరీల ఊరేగింపు

జైనథ్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జైనథ్ గ్రామానికి శనివారం మహారాష్ట్రలోని బోరి గ్రామానికి చెందిన పీరీలు రాగా.. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం పీరీలకు, డోలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సాత్నాల: భోరజ్ మండలంలో మొహర్రం సందడి మొదలైంది. కుల మతాలకతీతంగా గ్రామాల్లో పీరీల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పిప్పర్‌వాడ, కామాయి, మాండగాడా, భోరజ్ గ్రామాల్లో పీరీలను ప్రతిష్ఠించారు.

తలమడుగు: మండలంలోని రుయ్యాడి, తలమడుగు, బరంపూర్, సుంకిడి, దేవాపూర్, లింగి, పల్సితండా, కుచులాపూర్, ఖోడద్, కజ్జర్ల, కోత్తుర్, పల్లి(బి) గ్రామాల్లో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హస్సేన్ హుస్సేన్ దేవాస్థానాల వద్ద అగ్ని గుండం ఏర్పాటు చేసి, ఆటలు ఆడారు.

ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న అధికారులు

బోథ్: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ, స్వామి రామానంద తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం శనివారం బోథ్ మండల కేంద్రంలో ఎంపీడీవో రమేశ్, ఎస్సై ప్రవీణ్, ఎంపీవో అతుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణ పొందే మహిళలు ప్రతిరోజూ నిబద్ధతతో హాజరై, నైపుణ్యం సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్, శిక్షకురాలు శ్రీజ, ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ సురేశ్ వైద్య, వీడీసీ చైర్మన్ అల్లకొండ పోతన్న, దుర్గ కమిటీ అధ్యక్షుడు పాలిక్ రమేశ్, బోయడి ఆకాష్, భోజన్న పడిగేల, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఇంద్రవెల్లి: నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని వివిధ కంపెనీలో ఉద్యోగ ఆవకాశాలు కల్పించేందుకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ జేడీఎం నాగభుషన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరయ్యారు. 130 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కాగా.. పలువురిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశారు. నిరంతరం జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం మల్లేష్, ఏపీఎం రామారావ్, హెచ్ఆర్ మేనేజర్ వినోద్, సురేందర్, జేఆర్‌పీ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారాయి. వర్షపు నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



మురుగు నిల్వ ఉండకుండా చూడాలి



గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

తలమడుగు: వర్షాకాలంలో రోడ్లపై మురుగు నిల్వ ఉండకుండా చూడాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించారు. మురుగు నిల్వ ఉన్న చోట శుభ్రపరచాలని, ఈగలు దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గజానంద్, సునీత రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, రమణ, పద్మ, ఆశ వర్కర్ లక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

వయో వృద్ధులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ వైద్యులు ప్రీతల్ రాథోడ్, కస్తాల చంద్రశేఖర్ వయో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, కులకర్ణి, సత్యనారాయణ, శంకర్, నర్సిములు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

కైలాస్‌నగర్: బీసీ న్యాయవాదుల పెండింగ్ ఉపకార వేతనాలను విడుదల చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. 2012 నుంచి స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని , వాటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, ఉపాధ్యక్షులు చందుసింగ్, న్యాయవాదులు సంగెపు సుధీర్ కుమార్, ఉమేష్ రావు, తిలోత్తమా, రూపారాణి ఉన్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి విద్యార్థుల ఎంపిక


ఆకాష్


బిందుజ


తేజశ్రీ


అనుశ్రీ


కె. అక్షర


ఎం.రితిక


రాజ్‌కుమార్


అమృత


హర్ష


హర్ష వర్ధన్


జె. అజయ్

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రెండ్ల సంజన, రొడ్డ శిరీష, మేకల శ్రీజ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ రావ్ పేర్కొన్నారు.

నార్నూర్: నార్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి ఆకాష్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం. ప్రశాంత్ శనివారం తెలిపారు. కృషి పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించగలమన్నారు. విద్యార్థులు ఆకాష్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

తాంసి: మండలంలోని కప్పర్ల, తాంసి, పొన్నారి పాఠశాలకు చెందిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. తాంసి పాఠశాలకు చెందిన బిందుజ, పొన్నారి పాఠశాలకు చెందిన తేజశ్రీ, కప్పర్ల పాఠశాలకు గిజ్జ అనుశ్రీ, నాయిని అర్చన, దివ్యలు ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన ఇచ్చోడ గ్రామానికి చెందిన కే.అక్షర, దేగామ గ్రామానికి చెందిన ఎం.రితిక, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి, చందు నాయక్‌తండా గ్రామానికి చెందిన రాథోడ్ రాజ్‌కుమార్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు భూమన్న, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

సాత్నాల: భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన వాగాడే అమృత బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. మొదటినుంచి చదువులో చురుకుగా ఉండేదని ఉపాధ్యాయులు తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు అన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఎస్. హర్ష, బి, హర్షవర్ధన్, జె. అజయ్ ఎంపికయ్యారు. సీటు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

బోడ కాకర @ రూ.200



బోడ కాకర విక్రయిస్తున్న వ్యాపారులు

కైలాస్‌నగర్: వర్షాకాలం సీజన్‌లో లభించే బోడ కాకరకాయలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. వీటి ధర చికెన్‌తో పోటీ పడుతుంది. కిలో బోడకాకర ధర రూ.200 పలుకుతుంది. అటవీ ప్రాంతాల్లో లభించే బోడ కాకరకాయలను జైనథ్ మండల కేంద్రానికి చెందిన పలువురు వ్యవసాయ కూలీలు ఆదిలాబాద్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పట్టణంలోని రైతు బజార్‌తో పాటు అంబేడ్కర్ చౌక్, బస్టాండ్ ఎదురుగా, దస్నాపూర్ పెట్రోల్ బంక్ వద్ద వీటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆరోగ్యపరంగా అనేక పోషక విలువలతో కూడిన బోడకాకరకాయలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ఆరు ఇత్తడి విగ్రహాలు చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన విఠల్ రావ్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇంటి వెనక వైపు ఉన్న తలుపు గొళ్లెం తీసి దొంగలు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న ఆరు ఇత్తడి విగ్రహాలను దొంగలించారు. బాధితుడు టూ టౌన్‌లో ఫిర్యాదు చేయగా టూ సీఐ కరుణకర్‌రావ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లాసెట్ ర్యాంకర్‌కు సన్మానం



రుతికను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: లాసెట్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించిన ఎల్కుచి రుతికను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం సత్కరించారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో రుతికతో పాటు తండ్రి ఎల్కురి రాజశేఖర్‌ను సత్కరించారు. మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో రుతిక చదువుకు సహకరిస్తానని అన్నారు. కార్యక్రమంలో బోథ్ మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, వైద్యులు రవీంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.